## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం

**ప్రజాపక్షం/చర్లపల్లిః** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో విద్యార్థి సైబర్ మోసానికి గురైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని ఆర్ కామేష్(21) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. యూట్యూబ్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించిన వీడియోలు చూస్తుండగా సూర్య ఎక్స్ ట్రేడర్స్ అనే టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పరిచయమై వ్యక్తులు అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ట్రేడింగ్ మెంబర్‌షిప్ డిమ్యాట్ అకౌంట్ నిర్వహణ వివిధ పార్టీల పేరుతో పలుమార్లు డబ్బులు చెల్లింపచేశారు. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వకుండా మరిన్ని చెల్లింపులు కోరడంతో మోసం జరిగినట్లు బాధితుడు గుర్తించాడు. బాధితుడికి సుమారు లక్ష 28 వేల 828 నష్టం జరిగినట్లు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## కేశ్వాపూర్‌కు నూతన బస్ సర్వీస్ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేటః**మూడుచింతలపల్లి మున్సిపల్ కేశ్వాపూర్‌కు కుషాయిగూడ డిపో నుంచి నూతన ఆర్‌టిసి బస్ సర్వీస్‌ను జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్‌లు సోమవారం ప్రారంభించారు. గత కొంతకాలంగా కేశ్వాపూర్‌కు బస్ సర్వీస్ లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి ఇట్టి సమస్యను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా డిపో మేనేజర్ వేణుగోపాల్‌తో మాట్లాడి కేశ్వాపూర్‌కు నూతన బస్ సర్వీస్‌ను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నూతన బస్‌ను ప్రారంభించిన జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్‌లు మాట్లాడుతూ నూతన బస్ సర్వీస్‌ను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్సును మంజూరు చేసినందుకు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు, డిపో మేనెజర్ వేణుగోపాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లిః** నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలికి వారికి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎక్కడలేని విధంగా నూతన కార్యక్రమానికి ఎమ్మెల్యే స్వీకారం చుట్టారు. విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## బాధిత చిన్నారి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఖమ్మం జిల్లా తాళ్లపాడు గ్రామానికి చెందిన 12 ఏళ్ల చిన్నారి తేజస్వినిపై ఇటీవల జరిగిన లైంగిక దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ప్రస్తుతం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారి తేజస్విని కుటుంబ సభ్యులను బిసి హక్కుల సాధన సమితి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బిసి హక్కుల సాధన సమితి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ, సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ్ నాయకులు మాట్లాడుతూ నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. చికిత్స అవసరాల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసయ్య, బిసి హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాత్‌రాజు, నరసమ్మ, రాష్ట్ర నాయకుడు కె.మనచారి, తదితరులు పాల్గొన్నారు

## సమ్మె విరమించిన భవన నిర్మాణ కార్మికులు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్/మల్కాజిగిరి:** భవన నిర్మాణ కార్మికులు తాపీ మేస్త్రీలతో తలెత్తిన సమస్యల నేపథ్యంలో చేపట్టిన సమ్మెను సోమవారం విరమించినట్లు కార్మికుల సంఘాలు పేర్కొన్నారు. పేదలపై ఆర్థిక భారం మోపకుండా ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచకుండా సమిష్టి నిర్ణయాలతో ముందుకు వెళుతామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బాబు, రామన్న, రమేషాచారి, కమలాకర్, సంతోష్, యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, ఖాసిం, ప్రకటించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లిః** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఇ బాల్‌రాజ్ తెలిపారు. చర్లపలి డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్‌లోని 33/11 చర్లపల్లి 1 నుండి నాగారం ఫీడర్‌ను ఉదయం 10 గంటల నుండి 1 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేడంతో భగవాన్ కాలనీ, రెడ్డి కాలనీ, టీచర్స్ కాలనీ, కట్టింగ్ కాలనీ, హై టెన్షన్ రోడ్, మారుతీ నగర్ ప్రాంతాలు, నాగార్జున నగర్ కాలనీ సబ్ స్టేషన్‌విస్టాహోమ్స్ ఫీడర్‌ను మధ్యాహ్నం 2 గంటల నుండి 5.30గంటల వరకు నిలిపివేయడంతో శుభోదయ కాలనీ, శివసాయి నగర్, లక్ష్మి నరసింహ కాలనీ, మధురానగర్, నాగార్జుననగర్ కాలనీ రోడ్ నంబర్1 ప్రాంతాలతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

# పూడికతోనే పెరుగుతున్న వరద ముప్పు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో నాలాలపై నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్లాబుల వల్ల డీసిల్టింగ్‌కు వీల్లేకుండా పోయిందని, ఫలితంగానే వరద ముప్పు పెరుగుతోందని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. ట్రాఫిక్ జాయింట్ సిపిడి. జోయెల్ డేవిస్, ఇతర అధికారులతో కలిసి సోమవారం కొండాపూర్ జూబ్లీ గార్డెన్స్, శంషాబాద్, అత్తాపూర్, రామ్‌దేవ్‌బాబానగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వందల మీటర్ల మేర స్లాబ్‌లు మూసేయడం వల్లే చెత్త పేరుకుపోయి, మొండికుంట, ముల్లకత్వా చెరువుల్లోకి వెళ్లాల్సిన వరద నీరు జూబ్లీ గార్డెన్స్‌ను ముంచెత్తిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు.

**యుద్ధప్రాతిపదికన చర్యలు..**

కమిషనర్ ఆదేశాలతో జూబ్లీ గార్డెన్స్‌లో నాలాలపై స్లాబులను తొలగించి హైడ్రా సిబ్బంది పూడికతీత పనులు ప్రారంభించారు. డీసిల్టింగ్ అనంతరం ప్రతి 3 మీటర్లకు తెరిచే వీలుండేలా ఓపెన్ నాలాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డు, పి.వి. ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్లు 265, 191 వద్ద కూడా ఇన్‌లెట్లు, మురుగు కాలువలు పూడుకుపోవడం వల్లే నీరు నిలుస్తోందని స్పష్టం చేశారు. వారం రోజుల్లోగా ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని హైడ్రా అసెట్ విభాగం ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ ఆదేశించారు.

**జిహెచ్ఎంసిలో వర్షాకాల పారిశుద్ధ్య డ్రైవ్**

వర్షాకాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్య, ప్రజారోగ్య చర్యలను మరింత ముమ్మరం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా అన్ని జోన్‌లు, సర్కిళ్లలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నా రు. జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, కావడిగూడ సర్కిళ్ల లో వర్షపు నీటి కాలువల శుభ్రపరిచే పనులు, పూడిక తొలగింపు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల పరిశుభ్రత, రోడ్డు పక్కన ఉన్న కాలువల శుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు దోమల లార్వా నిర్మూలన, ఫాగింగ్, వాహక నియంత్రణ చర్య లు చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత, నీటి నిల్వ నివారణ, వ్యర్థాల వేరు వేరు సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తూ వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.




## ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధి బలోపేతం : డిజి సౌమ్య



**ప్రజాపక్షం/చర్లపల్లిః** చర్లపల్లి కేంద్ర కారాగారంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ) ఏర్పాటు సన్నాహకాలను తెలంగాణ జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా సమీక్షించారు. ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ కారాగార శాఖ చర్లపల్లి కేంద్రకారాగారం ప్రాంగణంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటిఐ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారని, ఐటిఐ ద్వారా ఖైదీలకు ఉపాధి ఆధారిత సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణ అందించి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందని ఆమె తెలిపారు. డిజితో సహ హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఉమెన్ విద్యార్థులు సందర్శించారు. పారిశ్రామిక విభాగ ప్రాంతీయ సంచాలకులు రవి చిలుకోటి, ఎన్ఎస్ఐ ఫర్ ఉమెన్ సంయుక్త సంచాలకులు, ప్రిన్సిపాల్ ప్రియా కార్యక్రమాల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐజి మురళీబాబు, డిఐజి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం ఖాలిద్, పర్యవేక్షణాధికారి ప్రమోద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో తరగతి గదుల నిర్మాణం

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** దేవరయాంజాల్ ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్తగా ఆధునిక సౌకర్యాలతో తరగతి గదులను నిర్మించేందుకు కృషి చేస్తానని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్, తూంకుంట, పోతాయిపల్లి, సింగాయిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలను సాధించాలని చెప్పారు.

పాఠశాలలో పది గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో నూతనంగా పది తరగతి గదులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పాఠశాలలో మౌళిక వసతులు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించి అవసరమైన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థు ల భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కమలాకర్, ప్రధానోపాధ్యాయులు బాలేష్, పాఠశాల చైర్ పర్సన్ మీనా, దేవాలయ మాజి చైర్మన్ లక్ష్మి నారాయణ, రోహిత్‌రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యటించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతాయిపల్లి గ్రామంలోని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గ్రామస్థులతో కలిసి న్యూ కాలనీతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించామని చెప్పారు.



**ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి ముందుకు సాగుతామని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట డివిజన్ పోతాయిపల్లిలోని రోడ్లు, డ్రైనేజిలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి ఇతర అంశాలను గ్రామంలో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, మురళిగౌడ్, నర్సింహారెడ్డి, బల్వంత్‌రెడ్డి, దర్శన్ గౌడ్, రాముగౌడ్, ప్రవీన్‌గౌడ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో సోమవారం 'అమ్మ మాట–అంగన్‌వాడి మాట' కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ రేణుక, బిఆర్ఎస్ నాయకురాలు శశికళ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల పేర్లను అంగన్‌వాడి కేంద్రాల్లో నమోదు చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడి కేంద్రా లు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సూపర్‌వైజర్ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకురాలు వరమ్మ, ఉమా, రేణుక, అండాలు, తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డు తొలగించాలి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** అనారోగ్యాలకు దారి తీస్తున్న జవహర్‌నగర్ రాంకీ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలంటూ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటి కోరింది. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం జేఏసి ప్రతినిధులు షేక్‌షావలి, తోటపల్లి శంకర్, టి.శివన్నారాయన,సదానందంలు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నిర్వహిస్తున్న రాంకీ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల నుండి సైతం చెత్తను ఇక్కడ పడేస్తుండటం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. డంపింగ్ యార్డు తొలగించని పక్షంలో తాము ఆందోళనలు అంచెలంచెలుగా ఉధృతం చేస్తామన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు

### కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లాకలెక్టర్ దీపక్‌తివారి అదేశించారు. వానకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువులు విత్తనాల విక్రయాలపై క్రమబద్ధీకరణ, నియంత్రణపై కొడంగల్ నియోజకవర్గం వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. ఎవరైన డీలర్లు నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయఅధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతు భీమ, రైతు భరోసా తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులుఎరువుల, విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లలో నమోదు చేయాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల, ఇతర శాఖల అధికారులను భాగస్వాములను చేసి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సన్నరకం బియ్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సన్న రకం వరిని సాగుచేసినవారికి 500 రూపాయిల బోనస్ చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్,గుట్టారు, జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం,వ్యవసాయ సహకార సంచాలకులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి వచ్చిన దరఖస్తులను త్వరితగతిన పూర్తి చేయాలిః** ప్రతి సోమవారం కలెక్ట ర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి వచ్చిన ప్రజల నుండి 133 దరఖాస్తు లు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకంలో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి, భూసర్వే తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటాచారి, ఉమశంకర్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మాకూ కనీస వేతనాలు, ఇఎస్‌ఐ, పిఎఫ్ ఇప్పించాలి


### ప్రజావాణిలో జిల్లా కలెక్టరేట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మొర

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే హౌస్ కీపింగ్ ఉద్యోగులు కనీస వేతనాలు, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి కనీస సౌకర్యాలు నోచుకోలేక పోతున్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఈ విషయమై గతంలో విన్నవించుకొన్న సందర్భంగా సానుకూలంగా స్పందించ సమస్య పరిష్కరించాలంటూ డిఆర్‌ఓకు చెప్పినా ఆయన మాటకు విలువ లేదన్న విధంగా నేటికీ ఫలితం లేకపోయిందని వారంతా వాపోతున్నారు. దీంతో వారంతా కల్సి చివరికి ప్రతి సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్న కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రజావాణిలో లిఖితపూర్వకంగా వినతి పత్రం ఇచ్చిన అనంతరం హౌస్‌కీపింగ్ ఉద్యోగులు తమ సమస్యను మీడియా ముందు ఆవేదనతో వెళ్లబుచ్చారు. తాము గత పదేళ్లుగా కలెక్టరేట్ కార్యాలయంలో వాత్సల్య ఏజన్సీ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నామని, కార్మిక నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా సదరు సంస్థ అనేక సంవత్సరాలు నెలకు రూ.6వేలు వేతనంగా ఇచ్చారని, పలుసార్లు ఆడుగుతుండటంతో రెండేళ్ల క్రితం నుండి రూ.10 వేలు ఇస్తున్నారని, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు ఇవ్వటం లేదని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఈ పరిస్థితి ఉంటే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే హౌస్ కీపింగ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా రూ.22 వేలు ఇస్తూ ఈఎస్‌ఐ, పిఎఫ్ ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ నామమాత్రంగా స్పందించకుండా రంగారెడ్డి జిల్లా తరహాలో వేతనాలను పెంచి ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## హెచ్‌ఐవి నియంత్రణకు కొత్త వైద్య దిశ

### జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** లైంగిక మార్గంలో వ్యాపించే ఇన్ఫెక్షన్లు (ఎస్టీలు) హెచ్‌ఐవీపై క్లినికల్ అవగాహన ఆధునిక నిర్ధారణ పద్ధతులు అభివృద్ధి చెందుతున్న చికిత్సా విధానాలపై సమగ్ర చర్చ హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో జరిగింది. ఎస్టీలు హెచ్‌ఐవీపై క్లినికల్ అవగాహన నిర్ధారణలో కీలక అంశాలు అభివృద్ధి చెందుతున్న చికిత్సలు అనే అంశం పై జరిగిన ఈసిఎంఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మార్గదర్శకత్వం అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, యూనివర్సిటీ సీఈఓ నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ లక్ష్మి ప్రసన్న అందించారు. చర్మవ్యాధులు, సుఖవ్యాధులు, కుష్ఠ వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ సహకారంతో జరిగిన ఈసిఎంఈలో రాష్ట్ర స్థాయి వైద్య నిపుణులు పాల్గొని తాజా పరిశోధన లు నిర్ధారణ పద్ధతులు చికిత్సా మార్గాలపై విశ్లేణాత్మక ప్రసంగాలు చేశారు. ఎస్టీఐలు హెచ్‌ఐవీ నియంత్రణలో ఆధునిక వైద్య పరిజ్ఞానం వినియోగం అత్యవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. కొత్త చికిత్సా విధానాలు తొందరగా గుర్తించే నిర్ధారణ పద్ధతులు భవిష్యత్ వైద్య రంగానికి కీలకమని ఈ వేదికలో స్పష్టం చేశారు.





## ప్రజాసేవకుడు మందలపు సాయిబాబు చౌదరి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కెపిహెచ్‌బి కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజామనిషి, సామాజిక సేవకుడు మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, అనుచరులు, మిత్రులు, స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అభిమానులు పుష్పగుచ్ఛాలు, గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కరోనా మహమ్మారి సమయంలో నిత్యావసర సరుకుల పంపిణీ, వరదలు ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు.

## కొత్త యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు : వ్యవసాయాధికారి చంద్రకళ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు కొత్త ఫెర్టిలైజర్ యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. సోమవారం అలియాబాద్‌లోని రైతు వేదికలో రైతులకు, ఫెర్టిలైజర్‌ల డీలర్లకు కొత్త ఫెర్టిలైజర్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాదికారి చంద్రకళ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ సీజన్‌లో కొత్త యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి రమేష్, విస్తరణ అధికారులు సుదీర్‌కుమార్, శ్రీనాద్, మండల రైతులు ముద్దం సంజీవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో..** మూడుచింతలపల్లి మున్సిపల్లోని రైతు వేదికలో మండల వ్యవసాయాదికారి ప్రవీన రైతులకు కొత్త యాప్‌పై ప్రత్యేక శిక్షణ శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొత్త యాప్ ద్వారానే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ఫెర్టిలైజర్ డీలర్లకు కొత్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వార రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. ఈ శిక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించారు. డీలర్ల పాత్ర, వాలంటీర్ల భాద్యత, రైతు సోదరులకు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

## చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లిః** చెరువులో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం సమయంలో తిమ్మాయిపల్లికి చెందిన ముగ్గురు యువకులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. వీరిలో తిమ్మాయిపల్లికి చెందిన జోసఫ్ సురక్షితంగా బయటపడగా కెవిన్ ఆంటోని(19) నీటిలో మునిగి మృతి చెందాడు. మృత దేహన్ని స్థానికులు, సహాయక సిబ్బంది చెరువు నుండి వెలికితీశారు. మరో యువకుడు వాలెంటైన్ టోనీ(18) చెరువులో గల్లంతై మృత దేహం లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

